క్లుప్తంగా

రేపు వాహనాల వేలం

ఖమ్మంక్రైం: ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఖమ్మం –1 పరిధిలో వివిధ గంజాయి, డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన 6 ద్విచక్రవాహనాలకు ఈనెల 10న మూడోసారి వేలం నిర్వహిస్తున్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ తెలిపింది. వేలంలో పాల్గొనే వారు 10న ఉదయం 11 గంటలకు ఎక్సైజ్ స్టేషన్ ఖమ్మం–1లో హాజరు కావాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భానుప్రసాద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19, 20 తేదీల్లో మధిరలో జరిగే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నేతలు మారిశెట్టి వెంకటేశ్వరరావు, మల్లెబోయిన ఉపేందర్‌రావు, మాళోత్ అయోధ్య, కర్నాటి నళిని, కాశిబోయిన అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న డీపీఎం ఆంజనేయులు

తిరుమలాయపాలెం: డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా ఉండి ప్రభుత్వం, బ్యాంకర్లు అందిస్తున్న రుణాలతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధిస్తున్నారని, ప్రతి మహిళ డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా చేరాలని డీపీఎం, స్త్రీనిధి ఆర్‌ఎం ఆంజనేయులు అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన మహిళలను డ్వాక్రాలో చేరొచ్చని తెలిపారు. ఐకేపీ ఏపీఎం చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు

తిరుమలాయపాలెం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎర్ర శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. పార్టీ నిర్మాణ ఐక్యతకు కృషి చేయాలన్నారు. పార్టీ నేతలు షేక్ బషీరుద్దీన్, శ్రీను, నాగేశ్వరరావు, సుధాకర్, మంగతాయారు, సుగుణమ్మ, యశోద, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి వినతి



వినతిపత్రం ఇస్తున్న మహిళా సంఘం సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌కు ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) ఆధ్వర్యాన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి మాట్లాడుతూ.. నిరంతరం దోమల నివారణ మందును పిచికారీ చేయాలని, బ్లీచింగ్ చల్లి ప్రజలను అంటువ్యాధుల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ, జిల్లా ఉపాధ్యక్షురాలు తుడుం ఝాన్సీ, ఖమ్మం డివిజన్ నాయకురాలు ఆవుల లక్ష్మి, కంకణాల అరుణ, జాస్మిన్, నిర్మల, ఆడెపు ఉమా తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశీలి పట్టాభిరాం

ఖమ్మంగాంధీచౌక్: మానసిక వికాస నిపుణుడు డాక్టర్ పట్టాభిరాం బహుముఖ ప్రజ్ఞాశీలి అని, మార్గ నిర్దేశకుడని ఖమ్మం కళాకారులు అభివర్ణించారు. మంగళవారం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో పట్టాభిరాం సంస్మరణ సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి కళాకారులు నివాళులర్పించి ఆయన కళారంగానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. సీనియర్ రంగస్థల నటుడు కాంతేశ్వరరావు, మల్లం రమేష్, రామడుగు వసంత్, కేవీ చారి, ఇల్లేపల్లిరమేష్, వీవీ రెడ్డి, జుజ్జూరు, రాజు, నాగేంద్రబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోమాలు

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని త్రీటౌన్ రంగనాయకుల గుట్టపై శ్రీకృష్ణసాయి ఆశ్రమంలో మంగళవారం ప్రత్యేక హోమాలు, అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమం చైర్మన్ రామారావు, కార్యదర్శి నాగమణి, ఆర్గనైజర్స్ నాగేశ్వరరావు, విజయశ్రీ, సత్యనారాయణ, రాజ్యలక్ష్మి, లలితమ్మ, విజయ పాల్గొన్నారు.

అను'గృహం' ఎన్నడో..?



ముచ్చర్లలో నిరుపయోగంగా మారిన డబుల్ బెడ్రూం ఇళ్లు

మండలంలో 40 'డబుల్' ఇళ్లు పూర్తి

- ముచ్చర్లలో 20, పింజరమడుగులో మరో 20 సిద్ధం
- నేటికీ ప్రారంభానికి నోచుకుని వైనం
- ఏడేళ్లుగా ఎదురుచూపులు
- పేదల్లో సన్నగిల్లుతున్న ఆశలు

కామేపల్లి: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు పడకల ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. సుమారు ఏడేళ్ల క్రితం చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను సదరు కాంట్రాక్టర్లు సకాలంలో పూర్తి చేయలేకపోయారు. కనీసం పూర్తయిన ఇళ్లను అయినా పంపిణీ చేయకపోవడంతో పిచ్చి మొక్కలతో ఇళ్లు దర్శనమిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పంపిణీ చేస్తారని ఎదురుచూస్తున్న పేదలకు ఏడాదిన్నరగా వారి ఆశలు కూడా సన్నగిల్లుతున్నవి.

పూర్తయిన 40 డబుల్ ఇళ్లు..

మండలంలోని ముచ్చర్ల గ్రామంలో 20, పింజరమడుగు గ్రామంలో మరో 20 డబుల్ బెడ్రూం ఇళ్లను గత ప్రభుత్వం మంజూరు చేయగా.. బిల్లులు సకాలంలో రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ నిర్మాణ పనులను నత్తనడక కొనసాగించారు. కాగా, రెండేళ్ల క్రితం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ పేదలకు ఇళ్ల కేటాయింపులో జ్యాపం జరుగుతోంది. దీంతో నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. వాటిల్లో పేకాట ఆడుతూ.. మద్యం సేవిస్తూ తలుపులు, కిటికీలు ధ్వంసం చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇళ్ల కోసం పలువురు దరఖాస్తు చేసుకోగా రెవెన్యూ అధికారులు గ్రామ సభ ద్వారా అర్హుల జాబితాను ప్రకటించారు. కానీ నేటి వరకు పంపిణీ చేయకపోవడంతో ఏళ్లుగా ఎదురు చూపులు తప్పడం లేదు.

అరకొర సౌకర్యాలు..

డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్న చందంగా నత్తనడకన సాగాయి. ఏళ్ల తర్వాత నిర్మాణ పనులు పూరిచేసినా.. కనీస మౌలిక వసతులు కల్పించడం మరిచారు. విద్యుత్, తాగునీరు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ వంటి కనీస సౌకర్యాలను కల్పించలేదు. దీంతో లబ్ధిదారులకు ఇళ్లను ఇచ్చినా వారికి తీవ్ర ఇబ్బందులు తప్పవు. కనీస సౌకర్యాలను ఏర్పాటు చేశాకే ఇళ్లను పంపిణీ చేయాలని కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో డబుల్ బెడ్రూం ఇల్లు

నిర్లక్ష్యం వీడాలి..



ముచ్చర్ల, పింజరమడుగులో డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తయినా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో నేటికీ పంపిణీ చేయలేదు. ఇళ్ల సముదాయాల్లో కనీస సౌకర్యాలు లేవు. ఒకవేళ ఇచ్చినా ఇబ్బందులు పడక తప్పదు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకుని ఇళ్లను పంపిణీ చేయాలి.

– కోలా లక్ష్మీనారాయణ, ముచ్చర్ల

త్వరలోనే పంపిణీ చేస్తాం..



ముచ్చర్ల, పింజరమడుగులో 40 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం పూర్తయినవి. ఇప్పటికే దరఖాస్తులను స్వీకరించి పారదర్శకంగా విచారణ చేపట్టి అర్హులను గుర్తించాం. ఇళ్ల సముదాయాల వద్ద మౌలిక వసతుల ఏర్పాటుకు సంబంధిత అధికారులను ఆదేశించాం.త్వరలోనే ఇళ్ల పంపిణీ చేపడతాం.

– సుధాకర్, తహసీల్దార్, కామేపల్లి

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి చంద్రశేఖర్‌రావు

ఖమ్మం లీగల్: చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని, తద్వారా చట్టపరిధిలో సంరక్షణకు అవకాశముంటుందని న్యాయసేవా సంస్థ జిల్లా కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. గృహహింస చట్టం, పోక్సో చట్టంతో పాటు ఇతర కేసులపై అవగాహన కల్పించిన ఆయన కేసు నమోదు చేసే సమయాన నిజాలే రాస్తే న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

➡ మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



వీల్ చైర్లు అందిస్తున్న పీడీ జయశ్రీ

కామేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు ఖమ్మం డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ జయశ్రీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సంబరాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం సీఎస్‌సీ కేంద్రాలకు వీల్‌చైర్లు అందించారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం శ్యామ్‌కుమార్, సీఎస్‌సీ కేంద్ర జిల్లా మేనేజర్ సురేశ్, వీఎల్‌ఈలు పాల్గొన్నారు.

➡ అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

ఖమ్మంమయూరిసెంటర్: అంగన్‌వాడీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. మంగళవారం కమిషనర్ ఖైకొండాయిగూడెం అంగన్‌వాడీ స్కూల్‌ను సందర్శించి కావాల్సిన సదుపాయాలపై ఆరా తీశారు.

ఖమ్మంఅర్బన్: నగరంలోని 1వ డివిజన్ ఖైకొండాయిగూడెం అంగన్‌వాడీ కేంద్రానికి మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన పనులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అందిస్తున్న మెనూపై ఆరా తీశారు. 6వ డివిజన్ రస్తోగినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆధునికీకరిస్తున్నామన్నారు.

➡ రాజకీయాల్లో రాణించాలి

ఖమ్మంరూరల్: మహిళల శక్తి సామర్థ్యాలను పెట్టుబడిదారి వ్యవస్థ తన చేతుల్లో కీలుబొమ్మగా మార్చుకుందని తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. ఏదులాపురంలో మంగళవారం జరిగిన మహిళా సమాఖ్య మండల ఐదవ మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిద్దినేని కర్ణకుమార్, మిడకంటి, చినవెంకటరెడ్డి, జమ్ముల జితేందర్ రెడ్డి, ఎడ్లపల్లి శంకరయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

➡ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని గాంధీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని దార యమున ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈమేరకు మంగళవారం పాఠశాల ఆవరణ హెచ్‌ఎం రామేశ్వరరావు సన్మానించారు. అనంతరం విద్యార్థిని పదో తరగతిలో 548 మార్కులు సాధించినందుకు గాను మలిశెట్టి వెంకటేశ్వర్లు మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతిగా లక్ష్మీపూజితకు రూ.5వేలను అందించారు. ఉపాధ్యాయుడు ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

➡ మెకానిక్ కుమార్తె పెళ్లికి రూ.10వేలు..

ఖమ్మం అర్బన్: ఖమ్మం నగరానికి చెందిన టూ వీలర్ మెకానిక్ రషీద్–ముంతాజ్ దంపతుల కూతురు షాహిదా పెళ్లి కానుకగా ఖమ్మం మెకానిక్ యూనియన్ తరఫున రూ.10వేల చెక్కును జిల్లా యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండలరావు మంగళవారం అందజేశారు. ప్రచార కార్యదర్శులు షేక్.సుభాని, షేక్.అబ్బాస్, షేక్.కుషీద్ పాల్గొన్నారు.

➡ నిత్యావసరాల పంపిణీ

నేలకొండపల్లి: మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు, వాసవి క్లబ్ ఉమ్మడి జిల్లా అధికారి రేగూరి వాసవి పుట్టినరోజు సందర్భంగా వికలాంగులకు నిత్యావసరాలు, స్థానిక హైస్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. మంగళవారం కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నవీన్, హనుమంతరావు, శేఖర్, సత్యనారాయణ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కరుణ, అశోక్ పాల్గొన్నారు.

➡ చేగొమ్మ సొసైటీ పాలకవర్గం రద్దు

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ సహకార సంఘ పాలకవర్గాన్ని రద్దు చేయడంతో పాటు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్‌ను నియమించాలని వ్యవసాయ, సహకార శాఖల సెక్రటరీ, ఐఏఎస్ అధికారి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. సంఘ చైర్మన్ ఇంటూరి శేఖర్ రాజీనామా చేయగా వైస్ చైర్మన్ బడేటి శ్రీనివాసరావు చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఈక్రమంలో పాలకవర్గాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, సహకార సంఘంపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ నిర్వహించిన ఉన్నతాధికారుల నివేదిక మేరకు ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం.

➡ జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం/గాంధీచౌక్/తిరుమలాయపాలెం: ప్రభుత్వ రంగ పరిశ్రమలను పరిరక్షించాలని, కార్మిక వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఈనెల 9న జాతీయ కార్మిక సంఘాలతో పాటు, రాష్ట్ర కార్మిక సంఘాలు, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం వివిధ సంస్థలు సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ సమ్మెలో కార్మిక వర్గం, రైతాంగం అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

➡ పాత చట్టాలనే కొనసాగించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: కార్మిక రైతు వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసి పాత చట్టాలనే కొనసాగించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు వంశీ, వినోదం, త్రినాథ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతిలో వరి సాగు మేలు



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకటేశ్వరరావు

రఘునాథపాలెం: వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేయడం ద్వారా విత్తన ఖర్చుతో పాటు నాటు కూలీల ఖర్చు కూడా తగ్గుతుందని ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని వేపకుంట్ల గ్రామంలో మంగళవారం 'నాణ్యమైన విత్తనం ప్రతి గ్రామం'కార్యక్రమం కింద పంపిణీ చేసిన 'సిద్ధి'వరి రకాన్ని పొడి దుక్కిలో వెదజల్లే పద్ధతిలో సాగు చేయడం వలన కలిగే లాభాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర్ రెడ్డి, విస్తరణ అధికారి ప్రతిభ, రైతులు ఉప్పెర్ల సురేష్, పొట్లపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతిలో..

నేలకొండపల్లి: డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేయాలని కూసుమంచి ఏడీఏ బి.సరిత సూచించారు. మండలంలోని సింగారెడ్డిపాలెంలో వరి వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్ పద్ధతిని మంగళవారం పరిశీలించడంతో పాటు పలు దుకాణాలను తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, ఏఈఓలు శిరీష, ద్రాతి, అవినాష్, అరవింద్, రైతులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ చైర్మన్‌కు సన్మానం



జగదీష్‌బాబును సన్మానిస్తున్న మిత్రులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం లయన్స్ క్లబ్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన న్యూరోసర్జన్ డాక్టర్ కె.జగదీష్‌బాబును ఆయన మిత్రులు మంగళవారం సన్మానించారు. స్థానిక ఉషోదయ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీను, బీసీ జేఏసీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుగు వెంకటరమణ, గాదర బాబు, వీరబాబు, కృష్ణ, సంజీవరావు, రాజు నరేంద్ర, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

తిరుమలాయపాలెం: నాయీ బ్రాహ్మణ సంఘం మండల కమిటీని తిరుమలాయపాలెంలో మంగళవారం ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా ఏలూరి వెంకట్రావు, మండల అధ్యక్షుడిగా ఆలేటి సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా యాకయ్య, ఉపాధ్యక్షుడిగా జంపాల రవి, కోశాధికారిగా కొలిపాక వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శిగా సైదులు, సహాయ కార్యదర్శిగా వీరేందర్ ఎన్నికయ్యారు. జిల్లా కన్వీనర్ నర్సింహారావు, కో కన్వీనర్ శ్రీనివాసరావు, జగదీష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నగర వాసికి డాక్టరేట్



పృథ్వీరాజ్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం బ్రాహ్మణబజార్‌కు చెందిన వల్లాల పృథ్వీరాజ్‌కు డాక్టరేట్ లభించింది. వరంగల్‌లో జరిగిన కాకతీయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఆయన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్‌లో పీహెచ్‌డీ చేసిన పృథ్వీరాజ్ ప్రస్తుతం కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా, యూనివర్సిటీ పీఆర్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్నారు.

'వికాస్' విద్యార్థినికి పురస్కారం



చిన్నారిని అభినందిస్తున్న కరస్పాండెంట్ లావణ్య

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్ రవీంద్రభారతిలో నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన గురుదేవోభవ కార్యక్రమంలో తమ విద్యార్థిని జ్ఞాన సహస్రకు కళామయూరి పురస్కారం లభించినట్లు వీడీవోస్ కాలనీలోని వికాస్ స్కూల్ కరస్పాండెంట్ వై.లావణ్య తెలిపారు. విద్యార్థినిని పాఠశాలలో సోమవారం అభినందించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

రాజకీయ అవకాశాలు కల్పించాలి

ఖమ్మంరూరల్: తెలంగాణలో నాయీబ్రాహ్మణులకు రాజకీయ అవకాశాలు కల్పించాలని నాయీ బ్రాహ్మణుల సంక్షేమ సంఘం మండల కన్వీనర్ నంద్యాల వీరబ్రహ్మం అన్నారు. మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులను ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు నంద్యాల నర్సింహారావు, గుడిమళ్ల వెంకటనారాయణ, నాగేశ్వరరావు, సైదులు, దర్గయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో ఆందోళన

తిరుమలాయపాలెం: తమ భూమిలో కావాలనే పంట కాల్వ నిర్మాణం చేసేందుకు చూస్తున్నారని ఎలాంటి సర్వే, నోటీస్ ఇవ్వకుండా ఇరిగేషన్ అధికారులు చేస్తున్న చర్యలపై ఎడెల్లి రవి అనే రైతు వాపోయాడు. తన పూర్వీకుల ద్వారా వచ్చిన రెండెకరాల ఐదు కుంటల భూమిలో గతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేశారని, కావాలనే కొందరు వ్యక్తుల అండతో మంగళవారం జేసీబీతో కాల్వ తవ్వకాలు చేసేందుకు చూశారని ఆరోపించాడు. ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా వచ్చినందుకు రవి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేయడంతో అధికారులు వెనుదిరిగారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా రామకృష్ణ



రామకృష్ణను అభినందిస్తున్న నాయకులు

కూసుమంచి: బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడిగా పాలేరు గ్రామానికి చెందిన శీలం రామకృష్ణ నియమితులయ్యారు. మంగళవారం పాలేరులో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. బహుజన సమాజాన్ని చైతన్యపరిచేందుకు యువతకు పార్టీ అవకాశాలు కల్పిస్తుందన్నారు. బహుజన రాజ్యం రావాలంటే బీసీ, బహుజనులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు, పాలేరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ బి.ఉపేందర్, అధ్యక్షుడు ఎన్నబోయిన రమేష్, నల్లగట్టు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీత్లా భవాని పండుగ

తండాల్లో గిరిజనులు తమ ఆరాధ్యదైవమైన సీత్లా భవానీ(దాటుడు పండగ) పండుగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు బోనాలతో వెళ్లి దేవతలకు నైవేద్యాలు సమర్పించగా రైతులు తమ పశువులకు పూజలు చేశారు. పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షినెట్‌వర్క్



కూసుమంచి: లాల్‌సింగ్‌తండాలో వేడుకల్లో పాల్గొన్న తండావాసులు



ఖమ్మంఅర్బన్: రాములుతండాలో ఊరేగింపుగా గ్రామ దేవతల వద్దకు వెళ్తున్న గిరిజనులు



నేలకొండపల్లి: చిన్నతండాలో మొక్కులు తీర్చుకుంటున్న గిరిజనులు

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానుల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆయన సేవలను కొనియాడారు.

– సాక్షినెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: బోనకల్ రోడ్డులో వేడుకల్లో పాల్గొన్న లక్కినేని సుధీర్



ఖమ్మంగాంధీచౌక్: శ్రీనివాసనగర్‌లో నివాళులర్పిస్తున్న అభిమానులు, రిటైర్డ్ ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు



రఘునాథపాలెం: వీవీపాలెంలో కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహిస్తున్న యూత్ సభ్యులు



నేలకొండపల్లి: మోటాపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



ఖమ్మంమయూరిసెంటర్: పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కామేపల్లి: కెప్టెన్‌బంజరలో వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



ఖమ్మంరూరల్: పోలేపల్లిలో..



అగ్రహారంలో తుమ్మా అప్పిరెడ్డి, తదితరులు